క్లుప్తంగా

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 13 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 13 మందికి రూ.1.30 లక్షల జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి ఉమాదేవి తీర్పునిచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ లక్ష్మీనారాయణ గత రెండు రోజులుగా వాహనాలు తనిఖీ చేస్తుండగా పలువురు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. మొత్తం 13 మందిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.1.30 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

ఆటో డ్రైవర్లకు చెక్ అందజేత



చెక్కును విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

పూతలపట్టు(యాదమరి): ఆటో డ్రైవర్ల సేవలో పథకం ద్వారా ఆటోవాలాల జీవితాల్లో కొత్త వెలుగులు నింపిందని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఆటోడ్రైవర్ల సేవలో పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించారు. ప్రజా రవాణాలో ఆటో డ్రైవర్ల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. స్త్రీశక్తి పథకంతో తమ జీవన పరిస్థితి అగమ్య గోచరం అయిందని ఆటో కార్మికులు ముఖ్యమంత్రికి మొరపెట్టగా వారి కోరిక మేరకు ఈ పథకాన్ని ప్రారంభించారన్నారు. ఈ పథకం ద్వారా నియోజకవర్గవ్యాప్తంగా సుమారు 1074 మంది ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు లబ్ధి చేకూరుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే మురళీమోహన్ రూ.1,61,10,00 చెక్కును నాయకులతో కలసి విడుదల చేశారు. కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, అధికారులు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

నేడు అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం

తవణంపల్లె: అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని తవణంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఘనంగా నిర్వహిస్తామని ఎంఈఓలు హేమలత, మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొంటారని పేర్కొన్నారు.

నత్తనడకన ఈ క్రాప్ నమోదు

గుడిపాల: మండలంలో నత్తనడకన ఈ- క్రాప్ నమోదు జరుగుతున్నట్లు వ్యవసాయాధికారి సంగీత తెలిపారు. మండలంలో 50,220 సర్వే నంబర్లు ఉండగా ఇప్పటి వరకు 3322 నంబర్లు మాత్రమే నమోదైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆమె అగ్రికల్చర్ అసిస్టెంట్ల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 25వ తేదీకి ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని వారికి తెలియజేశారు. అనంతరం ఆర్డీఓ శ్రీనివాసులు నత్తనడకన ఈ-పంట నమోదుపై వ్యవసాయాధికారిని పిలిపించి వివరాలు అడిగారు. జ్యూస్ ఫ్యాక్టరీలలో మామిడి పండ్లపై డ్యూటీలు వేయడంతో ఆలస్యమైందన్నారు. వీఆర్‌ఓల సహకారం కావాలని వ్యవసాయధికారి సంగీత ఆయనకు విన్నవించగా వీఆర్‌ఓల సహకారం తీసుకుని వెంటనే చేపట్టాలన్నారు. వీఆర్‌ఓలు అందరూ ఈ-పంట నమోదుపై ప్రత్యేకంగా దృష్టి సారించే విధంగా తహసీల్దార్ శ్రీనివాసులుకు ఆదేశించారు.

నేడు విజయవాడకు డీఈఓ కార్యాలయ సిబ్బంది

చిత్తూరు కలెక్టరేట్ : డీఎస్సీ నియామకాల ప్రక్రియకు సంబంధించిన కసరత్తు చిత్తూరు డీఈఓ కార్యాలయం నుంచి సిబ్బంది ఈ నెల 5న విజయవాడకు వెళ్లనున్నారు. ఈ నియామక ప్రక్రియలో ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఖాళీలను నమోదు చేసేందుకు కసరత్తు చేపట్టనున్నారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారుల సమక్షంలో కసరత్తు నిర్వహించేందుకు 10 మంది డీఈఓ కార్యాలయ సిబ్బంది విజయవాడకు వెళ్లనున్నారు. ఖాళీల నమోదు ప్రక్రియ పూర్తి అయిన వెంటనే ఈ నెల 10వ తేదీన డీఎస్సీ అభ్యర్థులకు వెబ్ కౌన్సెలింగ్ చేపట్టే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం చిత్తూరు, తిరుపతి జిల్లాలో నిర్వహిస్తున్న డీఎస్సీ అభ్యర్థుల శిక్షణా కేంద్రాల్లో ముందస్తుగా వెబ్‌కౌన్సెలింగ్ డెమో నిర్వహించేందుకు కసరత్తు చేపట్టనున్నారు. ఇది పూర్తయిన వెంటనే అర్హత సాధించిన అభ్యర్థులకు వెబ్ కౌన్సెలింగ్ విధానంలో ఖాళీలను నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించనున్నారు.

పిచ్చిమొక్కలతో ఇక్కట్లు



రోడ్డు పక్కన ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

గుడిపాల: రోడ్డుకు ఇరువైపులా పచ్చదనంతో ఆహ్లాదకరంగా ఉన్న ఈ రోడ్డులో ఆదమరిస్తే ప్రమాదం బారిన పడాల్సిందే. చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి బొమ్మసముద్రం వద్ద రోడ్డుకు ఇరువైపులా విపరీతంగా ముళ్లపొదలు పెరగడంతో వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. అధికారులు స్పందించి ముళ్లకంపలు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.



అరగొండ దగ్గర వాగును దాటడానికి ఇబ్బంది పడుతున్న ప్రజలు



దిగువమోదలపల్లె వద్ద నిండుగా కొత్తకుంట

పోటెత్తిన వరద


- చిత్తూరు, పూతలపట్టులో భారీ వర్షం
- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- చెరువులకు జలకళ
- పంటలకు తీరని నష్టం

తవణంపల్లె: మండలవ్యాప్తంగా వాగులు, వంకలు పొంగిపొర్లాయి. శుక్రవారం అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షం పడింది. అంతటా వాగులు, వంకలు పొంగి పొర్లడంతో ఆ నీరంతా అరగొండ బహుదానదిలో కలవడంతో ఉధృతంగా ప్రవహిస్తోంది. మండలంలో 82.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గాజులపల్లె- బోయపల్లె మధ్యలో బహుదానదికి వరద ఉధృతి పెరగడంతో ప్రజలు వాగు దాటలేక.. చెర్లోపల్లె, కామాలూరు మీదుగా అరగొండకు వాహనాలను మళ్లించారు. బోయపల్లె వద్ద నదిలో చెత్త, ముళ్లకంపలు నిండిపోవడంతో జేసీబీతో తొలగించారు. మధ్యాహ్నం వరద ఉధృతి తగ్గడంతో వాహనాలు, ప్రజల రాకపోకలు సాగిస్తున్నారు. పడమటి ప్రాంతాల్లోని అడవుల్లో అధిక వర్షం కురవడంతో మాధవరం వంక, సరకల్లు రామన్న చెరువు మొరవ పోవడంతో రెండు వంకల నీరు బోయపల్లె వద్ద బహుదానదిలో కలవడంతో ఉధృతంగా ప్రవహిస్తోంది. మండలంలోని చిన్న చిన్న కుంటలు పొంగి పొర్లాయి. అరగొండ నుంచి ఎ.గొల్లపల్లె వెళ్లే ప్రజలు వాగును దాటలేక ఇబ్బంది పడుతున్నారు. అరగొండ, గాజులపల్లె, బోయపల్లె వాగులు ఉధృతంగా ప్రవహించడంతో ఎస్‌ఐ చిరంజీవి పర్యవేక్షణలో సిబ్బంది అనుమతి లేకుండా ఎవరూ వాగులు దాటడానికి ప్రయత్నించరాదని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

జోరు వర్షం

కాణిపాకం: చిత్తూరు, పూతలపట్టు నియోజవర్గాల్లో శుక్రవారం అర్ధరాత్రి నుంచి జోరు వర్షం కురిసింది. కురిసిన వర్షానికి చిత్తూరు నగరంలోని పలు ప్రాంతాలు వర్షపు నీటితో నిండుకున్నాయి. రోడ్లన్నీ జలమయంగా మారాయి. అలాగే పలు చెరువులు జలకళను సంతరించుకుంటున్నాయి. కొన్ని నదులు నీటి ప్రవాహంతో పారుతున్నాయి. వాగులు, వంకలు ఉధృతంగా మారాయి. చెరువులకు నీరు చేరుతోంది. సాగులో ఉన్న పంటలు నేలమట్టం కాగా..మరికొన్ని పంటలకు వర్షం దెబ్బ పడనుంది. దీంతో రైతులకు తీరని నష్టం వాటిల్లింది.

నిండిన ఐరాల మండలంలోని బీరప్ప చెరువు



బంగారుపాళెంలో భారీ వర్షం

బంగారుపాళెం: మండలంలో భారీ వర్షం కురిసింది. గత రెండు రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోయారు. శుక్రవారం రాత్రి 11 గంటలకు చిరుజల్లులతో ప్రారంభమైన వర్షం శనివారం ఉదయం 10 గంటల వరకు పడింది. దీంతో వంకలు, వాగులు సాగి చెరువులకు నీరు చేరడంతో జలకళ సంతరించుకుంది. మండలంలోని గొనిచెరువు, గుంతూరు, జంబువారిపల్లె గ్రామాల్లోని వెంకటప్పనాయుని చెరువు, వీరప్పనాయుని చెరువు, బలిజపల్లెలోని చీకలచెరువులు మొరవలు పోతున్నాయి. బలిజపల్లెలోని కామాక్షమ్మ చెరువుకు నీరు చేరుతోంది. ఇలా రెండు సార్లు భారీ వర్షం కురిస్తే మండలంలోని చెరువులు నిండుతాయని ప్రజలు అంటున్నారు. భారీ వర్షానికి భూగర్భజలాలు సైతం వృద్ధి చెందాయని, బోరుబావుల్లో నీరు పుష్కలంగా వస్తుండడంతో వ్యవసాయ సాగుకు అనుకూలంగా ఉంటుందని రైతులు అంటున్నారు.

వారపు సంతలో అవస్థలు

బంగారుపాళెం: మండల కేంద్రం బంగారుపాళెంలో శనివారం వారపు సంతలో చిరువ్యాపారులు అవస్థలు పడ్డారు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం 10 గంటల వరకు వర్షం కురిసింది. వారపు సంతకు చిరువ్యాపారులు వర్షంలో తడుచుకుంటూనే కూరగాయలు, ఇతర వస్తువులు తీసుకువచ్చారు. తిరువల నెల మూడో శనివారం వేంకటేశ్వర స్వామికి పూజ కోసం అవసరమైన వస్తుసామగ్రి కొనుగోలుకు ప్రజలు వర్షంలో తడుచుకుంటూ వచ్చారు. వ్యాపారులు సైతం వర్షాన్ని లెక్క చేయకుండా తమ వ్యాపారం సాగించుకునేందుకు అవస్థలు పడ్డారు.





బంగారుపాళెంలో జోరుగా కురుస్తున్న వర్షం



బంగారుపాళెం: మొరవ పోతున్న గుంతూరు చెరువు



ఉధృహంగా ప్రవహిస్తున్న అరగొండ బహుదానది



చిత్తూరు మండలంలోని గువ్వకల్లు వంకకు నీటి వరద

దుండగులను కఠినంగా శిక్షించాలి

చిత్తూరు కార్పొరేషన్ : వెదురుకుప్పం మండలం దేవళంపేట ప్రధాన కూడలిలో భారత రాజ్యాంగ నిర్మాత డా బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు అంటించిన దుండగులను కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం నగరంలోని అంబేడ్కర్, గాంధీ విగ్రహాలకు ఆ పార్టీ నాయకులు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. మతోన్మాద బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహాలకు రక్షణ లేదని మండిపడ్డారు. రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని ప్రకటించిన బీజేపీ ఉండేంత వరకు ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉంటాయన్నారు. దేశానికి దిశా నిర్దేశించిన రాజ్యాంగానికి రక్షణ లేకపోతే మామూలు ప్రజలకు రక్షణ ఎలా ఉంటుందని ప్రశ్నించారు. రాష్ట్రంలో నిత్యం బడుగు, బలహీన వర్గాలపై దాడులు జరుగుతున్నప్పటికీ కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పార్టీలకు అతీతంగా వ్యవహరించి ఇలాంటి ఘటనలపై పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సీపీఎం నాయకులు

ముందస్తు చర్యలు చేపట్టాలి

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లాలోని పుంగనూరు నియోజకవర్గంలో భారీ వర్షాలు కురిసాయని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం వేకువజామున వరకు భారీవర్షాలు కురిసాయన్నారు. ఈ వర్షాలకు పుంగనూరు నియోజకవర్గంలో కుంటలు, చెరువులు నిండిపోయాయని తెలిపారు. అవి ఎప్పుడు తెగిపోతాయో అనే భయంతో అక్కడి ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారన్నారు. ఇరిగేషన్ అధికారులు చెరువులు, కుంటలు, వాగులు తెగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. సదుం, సోమల, చౌడేపల్లి మండలాల్లో రైతుల పంట పొలాలు అధిక వర్షాలకు దెబ్బతిన్నట్లు తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అధికవర్షాలు కురిసిన ప్రాంతాల్లో స్థానిక అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండేలా ఆదేశించాలన్నారు. అధిక వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

బ్యాంకులో సర్వర్ సమస్య



గుడిపాల: సర్వర్ పని చేయకపోవడంతో బ్యాంకులో గుమిగూడిన ఖాతాదారులు

గుడిపాల: బ్యాంకులో సర్వర్ సమస్యతో ఖాతాదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. గుడిపాలలో ఉన్న సప్తగిరి గ్రామీణ బ్యాంక్‌ను ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా మార్చడంతో బ్యాంకులో ఖాతాదారులకు కష్టాలు మొదలయ్యాయి. బ్యాంక్ అకౌంట్ నంబర్లు కొత్తవి ఇస్తుండడంతో సర్వర్లు పనిచేయక జనం నానా తంటాలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఖాతాదారులు బ్యాంకులకు వచ్చి సర్వర్ పని చేయకపోవడంతో చాలామంది వెనుదిరిగారు. గత నాలుగు రోజులుగా బ్యాంకులో ఇదే సమస్య తలెత్తుతోందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

బంగారుపాళెం: మండల ప్రజలు తిరవల నెల మూడో శనివారాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాలు, ఇళ్లల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. మండలంలోని నలగాంపల్లెలో గల శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. స్వామివారికి ఉదయం ఆలయ అర్చకులు ప్రభాకర్‌స్వామి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం సతీసమేతుడైన స్వామి మూలవర్లను విశేషంగా అలంకరించి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. పరిసర గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు గోవింద నామస్మరణ చేస్తూ వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.



విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి

7న వాల్మీకి జయంతి వేడుకలు

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 7వ తేదీన మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 7వ తేదీన కలెక్టరేట్‌లోని వివేకానంద భవన్‌లో ఉన్న సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు ప్రజలు, సంఘాల నాయకులు హాజరుకావాలని కోరారు.

ముగ్గురికి ఏఓలుగా ఉద్యోగోన్నతి

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లా పరిషత్ పరిధిలో సీనియర్ అసిస్టెంట్‌లుగా విధులు నిర్వహిస్తున్న ముగ్గురికి ఏవోలుగా ఉద్యోగోన్నతి కల్పించారు. ఈ మేరకు శనివారం జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు ఉత్తర్వులు జారీచేశారు. ఆ మేరకు చౌడేపల్లిలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సుకన్యను సదుం మండలం ఏఓగా నియమించారు. పలమనేరు పీఐయూలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న శాంతిని పాకాల ఏఓగా, జెడ్పీలో సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్‌రెడ్డిని రామచంద్రాపురం ఏఓగా ఉద్యోగోన్నతి కల్పించి పోస్టింగులు జారీచేశారు.

స్వచ్ఛ పంచాయతీగా కెనమాకులపల్లి

శాంతిపురం: రాష్ట్ర స్థాయి స్వచ్ఛ గ్రామ పంచాయతీగా మండలంలోని కెనమాకులపల్లి ఎంపికైనట్టు ఎంపీడీఓ ఏపీఆర్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 6న విజయవాడలో జరిగే కార్యక్రమంలో సీఎం నుంచి అవార్డు ప్రదానోత్సవం జరుగుతుందని తెలిపారు. చెత్త సేకరణకు మండలంలోని అన్ని పంచాయతీలకు ఒక్కోటి రూ.3 లక్షల విలువైన ఎలక్ట్రిక్ ఆటోలు మంజూరయ్యాయన్నారు. మొత్తం 60 మంది క్లాప్ మిత్రలను నియమించడంతో పాటు వీరి గౌరవ వేతనం కోసం ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.50 లక్షలు రిజర్వులో ఉంచామని తెలిపారు. వర్మీకంపోస్టు తయారీ సాగుతోందని, ఆయా కేంద్రాల మరమ్మతులకు రూ.10 లక్షల జెడ్పీ నిధులను వ్యయం చేశామని పేర్కొన్నారు.

నేడు బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ

చిత్తూరు కార్పొరేషన్ : నగరంలో ఆదివారం బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నగరంలోని 4 వ వార్డు కట్టమంచిలో ఉన్న పెరుమాళ్ గుడి వీధిలో జరుగుతుందన్నారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో చంద్రబాబు మేనిఫెస్టో మోసాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు.

స్వయం కృషితో ఉపాధి పెంచుకోవాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఆటోడ్రైవర్లు స్వయం కృషితో ఉపాధి పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ అన్నారు. చిత్తూరు నగరంలోని నాగయ్య కళాక్షేత్రంలో శనివారం చిత్తూరు నియోజకవర్గ పరిధిలోని ఆటో డ్రైవర్ సేవలో అనే కార్యక్రమం నిర్వహించారు. తొలుత ర్యాలీ చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సహకారాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. ఆటో డ్రైవర్ల సమస్యలు తీర్చడం కోసం ప్రభుత్వం అన్ని ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేస్తుందన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం అందించిన రూ.15000 ఆర్థిక సాయం కుటుంబ అవసరాల కోసం వినియోగించుకునే అవకాశం లభించిందన్నారు. అర్హులైన వారు లబ్ధిదారుల జాబితాలో లేకపోతే సమస్యను పరిష్కరించి వారిని లబ్ధిదారుల జాబితాలో చేర్చుతామన్నారు. ఆటో, మ్యాక్స్, క్యాబ్ డ్రైవర్లు క్రమశిక్షణగా ఉండాలని, ఎక్కడా నిబంధనలు ఉల్లంఘించవద్దని హెచ్చరించారు. జిల్లాలో సుమారు 6777 మంది లబ్ధిదారులకు రూ.10.16 కోట్లు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాకు జమ అయిందన్నారు. అనంతరం చిత్తూరు నియోజకవర్గ పరిధిలోని 1402 మంది లబ్ధిదారులకు రూ.2,10,30,000 మెగా చెక్కును పంపిణీ చేశారు. అనంతరం వర్చువల్ విధానం ద్వారా ముఖ్యమంత్రి ప్రసంగాన్ని సభికులు తిలకించారు. కార్యక్రమంలో డీటీసీ నిరంజన్ రెడ్డి, జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



చెక్కు పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే